సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.18,890

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీ గరిష్టంగా రూ.18,890, కనిష్టంగా రూ.4 వేలు పలికాయి.



ఆర్డీటీ సెట్ రద్దు

పేద కుటుంబాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థుల ఇంటర్మీడియెట్ చదువుకు చేయూతనిచ్చేందుకు ఏటా నిర్వహించే 'ఆర్డీటీ సెట్'ను రద్దు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. IIలో

గరిష్టం/కనిష్టం
41.1°/22.9°

జిల్లావ్యాప్తంగా శనివారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి భగభగలతో వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జీలను కలిసిన ఎస్పీ రత్న



హైకోర్టు జడ్జితో మాట్లాడుతున్న ఎస్పీలు

పుట్టపర్తి టౌన్: హైకోర్టు జడ్జీలు రామకృష్ణ ప్రసాద్, హరహరనాథశర్మను ఎస్పీ రత్న మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన జడ్జీలను ఎస్పీ రత్నతో పాటు జిల్లా జడ్జి భీమారావ్, అనంతపురం ఎస్పీ జగదీష్ అనంతపురం ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద కలిశారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతి భద్రతలపై జడ్జీలతో కాసేపు చర్చించారు.

వీరాపురాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- కలెక్టర్ టీఎస్ చేతన్



వెంకటాపురంలో కొంగలను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

చిలమత్తూరు: సైబీరియన్ పక్షులకు నెలవైన వీరాపురం, వెంకటాపురం గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శనివారం ఆయన వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో సైబీరియన్ పక్షుల నివాస ప్రాంతాలను పరిశీలించారు. పక్షులకు తాగునీరు, ఆహారం, సౌకర్యాలు వంటి వాటిపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంగలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంకటాపురం, వీరాపురం చెరువులకు నీరు నింపేందుకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పక్షులను సంరక్షించడంలో భాగంగా ఈ రెండు గ్రామాల చెరువులను చిత్తడి నేలగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు. పర్యాటకుల కోసం వసతి సదుపాయాలు, వాచ్ టవర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పెనుకొండ అటవీ క్షేత్ర అధికారి జె. శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

- తొలిరోజు పోటాపోటీగా లీగ్ మ్యాచ్‌లు




మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 54వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లా జట్లు పాల్గొన్న ఈ టోర్నీని డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజినేయులు ప్రారంభించారు.

తొలిరోజు మ్యాచ్‌లు ఇలా...

తొలిరోజు జరిగిన లీగ్‌మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై అనంతపురం జట్టు నాలుగు గోల్స్ తేడాతో గెలుపొందింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టుపై కర్నూలు, అనంతపురం జిల్లా జట్టుపై వైఎస్సార్ జిల్లా, ఈస్ట్ గోదావరి జట్టుపై వెస్ట్ గోదావరి, నంద్యాల జట్టుపై చిత్తూరు, ప్రకాశం జట్టుపై వెస్ట్ గోదావరి, నంద్యాల జట్టుపై విజయనగరం, బాపట్ల జట్టుపై కర్నూలు జట్లు విజయం సాధించాయి.



నిప్పుల వాన

వడదెబ్బ లక్షణాలు

- విపరీతమైన తలనొప్పి, వాంతికి వచ్చినట్లు ఉండటం
- నాలుక తడి ఆరిపోయినట్లు ఉండటం
- శరీర ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరగడం
- శరీరం బాగా అలసిపోయినట్లు ఉండటం
- మాట తడబడుతున్నట్లు ఉండటం
- ఒక్కోసారి కండరాలు పట్టేసినట్టు అనిపించడం
- వెంటనే నీరసం వచ్చేసి ఎక్కడైనా వాలిపోవాలనిపించడం
- శరీరం తిమ్మిరిగా అనిపించడం

వడదెబ్బకు గురికాకూడదంటే..

- మధ్యాహ్నం పూట ఇంట్లోనే ఉండాలి.
- ఎక్కువ మోతాదులో మంచినీళ్లు తీసుకోవాలి.
- ఎండలో తిరిగి వచ్చినప్పుడు కొబ్బరి నీళ్లు లేదా ఓఆర్ఎస్ తీసుకోవాలి.
- జ్వరం లేదా నీరసం అనిపించినప్పుడు వెంటనే సెలైన్ పెట్టించుకోవాలి.
- బీపీ, షుగర్, గుండెజబ్బులకు మందులు వాడే వారిలో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. వీరు మరింత జాగ్రత్తగా ఉండాలి.
- వేసవిలో తేలికపాటి వ్యాయామాలు మాత్రమే చేయాలి.
- దోస, పుచ్చ, దానిమ్మ, అరటి వంటి పండ్లను బాగా తీసుకోవాలి.
- పండ్లతో పాటు పండ్ల రసాలు ఎక్కువగా తీసుకుంటే వేడి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- జ్వరంగా ఉంటే నుదిటిపై తడిబట్టను పెట్టాలి.

భానుడు నిప్పుల వాన కురిపిస్తున్నాడు. వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటి నమోదవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

- భారీగా పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్‌లోనే 42 డిగ్రీలను దాటుతున్న వైనం
- మేలో 45 డిగ్రీల వరకూ పెరిగే అవకాశం ఉందంటున్న శాస్త్రవేత్తలు
- వృద్ధులు, బాలింతలు, చిన్నారులు బయటకు రావద్దంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో భానుడు భగ భగ మండిపోతున్నాడు. పగటి పూట ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి. ఏప్రిల్ మొదటి వారంలో 40 డిగ్రీల లోపు ఉన్న ఉష్ణోగ్రతలు తాజాగా 42 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ వేడిమికి తాళలేక జనం అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పట్టణాల్లో వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పల్లెటూళ్లలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఎండదెబ్బకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ కూలి పనులకు వెళ్లి ఇప్పటికే ఓ వ్యక్తి మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. వడదెబ్బ కేసులు పెరుగుతున్నట్లు ఆస్పత్రుల రికార్డులు వెల్లడిస్తున్నాయి.

45 డిగ్రీలు దాటే అవకాశం..

గత ఏడాది ఇదే సమయానికి 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి మాత్రం అప్పుడే 42 డిగ్రీలు నమోదైంది. రానున్న నెలన్నర రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మే రెండో వారం నుంచి ఎండ తీవ్రత మరింతగా ఉంటుందని, వడదెబ్బ ప్రభావం తారస్థాయికి చేరుకుంటుందని పేర్కొంటున్నారు. మరోవైపు వృద్ధులు, బాలింతలు, చిన్నారులు మధ్యాహ్నం పూట బయటకు రావద్దని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుందని, వాళ్లు కూడా ఎండలో తిరగకూడదంటున్నారు.

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఇలా...	
ఎప్పుడు	ఎంత
ఫిబ్రవరి	30.2 డిగ్రీలు
మార్చి రెండోవారం	32.7
మార్చి చివరలో	35.6
ఏప్రిల్ మొదటి వారం	39.8
ఏప్రిల్ చివరి వారం	42.0

ఈసారి ఎండలు ఎక్కువే

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత కాస్త ఎక్కువగానే ఉంది. మేలో 45 డిగ్రీల వరకూ నమోదు కావచ్చు. మిగతా జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉక్కపోత (హ్యుమిడిటీ) తక్కువ. ఈ ఏడాది కాస్త ముందస్తు వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

– విజయశేఖర్, సైంటిస్ట్, రేకులకుంట వాతావరణ కేంద్రం



శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపిస్తున్న అనంతపురంలోని టవర్ క్లాక్ ప్రాంతం

వడదెబ్బతో వ్యక్తి మృతి



మల్లికార్జున మృతుడు (ఫైల్)

గాండ్లపెంట: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం గాండ్లపెంటలో చోటుచేసుకుంది. మృతుని భార్య చంద్రకళ తెలిపిన వివరాల మేరకు...గాండ్లపెంట గంగమ్మ వీధిలో ఉండే ఎస్.మల్లికార్జున (55) కదిరిలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తెల్లవారుజాము 5 గంటలకే విధుల్లోకి వెళ్తుంటాడు. అయితే శనివారం తెల్లవారుజామున మల్లికార్జున ఎంతకూ నిద్రలేవకపోవడంతో భార్య చంద్రకళ అతన్ని నిద్రలేపేందుకు ప్రయత్నించింది. తనకు ఆరోగ్యం సరిగా లేదని తెలిపి ముఖం కడుక్కునేందుకు లేచాడు. అయితే కళ్లుబైర్లు కమ్మాయని చెబుతూ ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. దీంతో భార్య ఇరుగుపొరుగు వారి సాయంతో మల్లికార్జునను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే అతను మృతి చెందాడు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మల్లికార్జున హోటల్‌లో పనిచేశాడని, ఎండ వేడిమికి అనారోగ్యానికి గురై రాత్రి ఇంటికి రాగానే పడుకున్నాడని, ఈ క్రమంలో మృతి చెందాడని భార్య చెబుతోంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

'పాలిసెట్' పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా నుంచి 5,326 మంది దరఖాస్తు.. 15 కేంద్రాల ఏర్పాటు
- డీఆర్‌ఓ విజయసారథి



పాలిసెట్ నిర్వహణపై సమీక్షిస్తున్న డీఆర్‌ఓ విజయ సారథి


ప్రశాంతి నిలయం: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 30న జిల్లాలో జరిగే 'పాలిసెట్-2025' పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ విజయసారథి ఆదేశించారు. పాలిసెట్ పరీక్ష నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో డీఆర్‌ఓ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధర్మవరం, కదిరి, హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలల పరిధిలోని 15 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన 5,326 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని వెల్లడించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదన్నారు. ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్‌లు వాడకూడదన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలన్నారు. కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఒక్క నిమిషం దాటినా పరీక్షకు అనుమతించం

పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఉంటుందని, అభ్యర్థులు 10 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని డీఆర్‌ఓ సూచించారు. 11 గంటల తర్వాత ఒక్క నిముషం దాటినా పరీక్షకు అనుమతించబోమన్నారు. సమావేశంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం, కదిరి, హిందూపురం పాలిటెక్నికల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు రమ, హరీష్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ బాలస్వామి, ఆర్టీసీ డీఎం ఇనాయతుల్లా, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్, హిందూపురం తహసీల్దార్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓగా సయ్యద్ మౌల

పుట్టపర్తి టౌన్: జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ)గా సయ్యద్ మౌల శనివారం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరు డీఐఈఓగా ఉన్న ఆయన్ను ఇటీవలే ఉన్నతాధికారులు జిల్లాకు బదిలీ చేశారు. దీంతో శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇన్నాళ్లూ ఇక్కడ ఇన్‌చార్జ్ డీఐఈఓగా ఉన్న రఘునాథరెడ్డి రిలీవ్ అయ్యారు. నూతన డీఐఈఓగా బాధ్యతలు చేపట్టిన మౌలకు జూనియర్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, ఉర్దూ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అబ్దుల్ రషీద్, పలువురు అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐఈఓ





ఖాద్రీ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఖాద్రీశా... కరుణించవయా

- భక్తులతో పోటెత్తిన లక్ష్మీ నరసింహుడి ఆలయం

కదిరి టౌన్: ఖాద్రీశుని ఆలయం భక్తులతో పోటెత్తింది. శనివారం, పాఠశాలలకు వేసవి సెలవులు... కలసి రావడంతో కదిరిలోని ఖాద్రీ లక్ష్మీ నరసింహుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. ఖాద్రీశుని దర్శనానికి బారులు తీరారు. క్యూలో ఉన్న వారు కాటమరాయుడిని తలచుకుంటూ గోవింద నామస్మరణ చేశారు. దేవేరులతో కలిసి కొలువుదీరిన వసంతవల్లభుడిని దర్శించుకుని తరించారు. సాయంత్రం వేళ మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

క్లుప్తంగా

ఆర్డీటీ సెట్ రద్దు

బత్తలపల్లి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన పేద విద్యార్థుల ఉన్నత చదువులు చదివించేందుకు ఆర్డీటీ ఏటా నిర్వహించే ఆర్డీటీ సెట్ రద్దయినట్లు సంస్థ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ కృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. పదో తరగతిలో 500 మార్కులు పైబడి ఉత్తీర్ణత సాధించిన పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు సంస్థ ఏటా ఆర్డీటీ సెట్ నిర్వహిస్తోందన్నారు. అయితే సంస్థ ఎఫ్‌సీఆర్ఏ ఖాతాను నిలుపుదల సమస్యతో నిర్వాహకులు ఆర్డీటీ సెట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలియజేశారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కదిరి అర్బన్: పట్నం సమీపంలో కదిరి–అనంతపురం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..ముదిగుబ్బకు చెందిన వెంకటేష్‌నాయక్(40) మల్లికార్జున నాయక్‌తో కలిసి బైక్‌పై పని నిమిత్తం కదిరికి బయలుదేరారు. పట్నం గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. బైక్ వెనక కూర్చున్న వెంకటేష్‌నాయక్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లికార్జుననాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉంటారా.. ఊడతారా!

- జేఎన్‌టీయూ(ఏ)లో 2017లో 9 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ
- ప్రొఫెసర్లను తొలగించాలంటూ గతంలో హైకోర్టు ఆదేశాలు
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రొఫెసర్లు
- తాజాగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని సుప్రీం ఆదేశాలు



జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రొఫెసర్ పోస్టుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని రెండు వారాల్లో తెలియజేయాలని కోరింది. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి వాస్తవాలు తెలియజేయాల్సి రావడంతో వివరాలు ఎలా పంపాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. వాస్తవాలు కప్పిపుచ్చి సుప్రీంకోర్టుకు పంపితే చర్యలు తప్పవనే ఉద్దేశంతో ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు తోసిరాజని...

- జేఎన్‌టీయూ అనంతపురంలో పరిధిలో అనంతపురం, కలికిరి, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలల్లో 10 ప్రొఫెసర్ ఉద్యోగాలకు అక్టోబర్ 10, 2017న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 9 మందిని ఎంపిక చేశారు. ముగ్గురి విషయంలో అన్ని నిబంధనలూ తుంగలో తొక్కారు. పీహెచ్‌డీ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం ఉంటేనే ప్రొఫెసర్ పోస్టుకు అర్హులు. కానీ అనంతపురం జేఎన్‌టీయూలో ప్రొఫెసర్లుగా నియమితులైన ముగ్గురు అభ్యర్థులకు ఐదేళ్ల అర్హత లేదు. కంప్యూటర్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా నియమితులైన అభ్యర్థి 2014లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2017 సంవత్సరానికి నోటిఫికేషన్ ఇచ్చిన సమయానికి ఐదేళ్ల అనుభవం లేదు. అయినా ప్రొఫెసర్ పోస్టుకు ఎంపిక చేశారు. మరో అభ్యర్థి ఈఈఈ విభాగంలో జేఎన్‌టీయూ కాకినాడలో 2017 జనవరిలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. నోటిఫికేషన్ ఇచ్చిన సమయానికి కేవలం 8 నెలల అనుభవం మాత్రమే ఉంది. 2015లో పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థికి ఐదేళ్ల అనుభవం ఉందని మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్ ఉద్యోగాన్ని కట్టబెట్టారు. ఇదే అభ్యర్థి 2007 ఎస్కేయూలో పాలిమర్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. పాలిమర్ పీహెచ్‌డీని పరిగణనలోకి తీసుకుని ఏ మాత్రం సంబంధం లేని మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపిక చేశారు.

హైకోర్టులో కేసు..

ఈ అంశంపై కొందరు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో 'గ్రూప్ విధానం తప్పు.. సబ్జెక్టు ఆధారంగా రిజర్వేషన్ అమలు చేయాలి. రోస్టర్ విధానం పోస్టుల ఆధారంగా ఉండాలి. ఖాళీల ఆధారంగా చేయడం చెల్లదు. మహిళలకు, దివ్యాంగులకు హారిజాంటల్ రిజర్వేషన్ వర్తిస్తుంది. ప్రస్తుత నోటిఫికేషన్లు తప్పు. నోటిఫికేషన్లు సరిచేయాలి' అని హైకోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. ఈ తీర్పునకు లోబడి 9 మంది ప్రొఫెసర్లను విధుల నుంచి జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ తొలగించారు.

హైకోర్టు బెంచుకు అప్పీలు

సింగిల్ జడ్జి తీర్పును వ్యతిరేకిస్తూ 9 మంది ప్రొఫెసర్లు తిరిగి హైకోర్టు బెంచ్‌కు అప్పీలు చేశారు. ఉద్యోగ తొలగింపు ఉత్తర్వులపై స్టే విధించారు. 2023, ఆగస్టు 4వ తేదీన హైకోర్టు బెంచ్ సైతం సింగిల్ జడ్జి తీర్పును ఏకభవిస్తూ తీర్పు వెలువరించింది. ప్రొఫెసర్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు చేయాలని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. దీంతో తిరిగి హైకోర్టు బెంచ్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. హైకోర్టు ఈ నియామకాలు చెల్లదని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రొఫెసర్లను సుప్రీంకోర్టు నిబంధనలకు లోబడి విధుల్లో కొనసాగిస్తున్నారు. 2023 ఆగస్టు 4వ తేదీన హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని సూచించాలని పేర్కొనడంతో 9 మంది ప్రొఫెసర్లలో ఆందోళన నెలకొంది.

పోస్టల్ బీమా ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: హిందూపురం డివిజన్‌లో గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ)డైరెక్ట్ ఏజెంట్లుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు శనివారం తపాలా శాఖ హిందూపురం సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్‌వీడి రోడ్డులోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 28 నుంచి 30(ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు) వరకు జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. టెన్త్ విద్యార్హత కల్గి 18 నుంచి 50ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు కెవీపీ, ఎన్ఎస్‌సీ రూపంలో చెల్లించాలన్నారు. వివరాలకు తపాలా శాఖ హిందూపురం సూపరింటెండెంట్ కార్యాలయం, తపాలా జీవిత బీమా డివిజన్ ఆఫీసులో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



యువకుడి మృతదేహం

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల పంచాయతీలోని చిన్నంపేట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. చిన్నంపేట సమీపంలోని పొలంలో రాళ్ల మధ్యన యువకుడి మృతదేహం ఇరుక్కున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు 25 నుంచి 30 ఏళ్లుండి ఎరుపు రంగు టీషర్ట్, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టని విధంగా ఉందన్నారు., ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

'హంద్రీ-నీవా' బ్లాస్టింగ్ రాయి తగిలి బాలుడికి తీవ్రగాయాలు



బాలుడికి తగిలిన బ్లాస్టింగ్ రాయి



గాయపడిన తిరుమల సాయి

పుట్టపర్తి: హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ చేయడంతో రాయి తగిలి ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..బుక్కపట్నం మండలం జానకంపల్లి సమీపంలో హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. శనివారం కాలువలో రాయి ఉండటంతో దానిని పగులగొట్టేందుకు కాంట్రాక్టర్లు బ్లాస్టింగ్ చేశారు. ఈ క్రమంలో 8 నుంచి 10 కేజీల బరువున్న ఓ రాయి జానకంపల్లి ప్రధాన రహదారి వద్దకు వచ్చి తిరుమలసాయి అనే బాలుడి కాలికి తగిలింది. తీవ్రగాయాలపాలైన బాలుడిని కాంట్రాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాలువకు జానకంపల్లికి 200 మీటర్ల దూరం ఉందని, బ్లాస్టింగ్ సమయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్తులు, బాధితుడి తల్లి దండ్రులు పేర్కొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ జగన్ వెంటే

- అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చేది లేదు
- 16వ వార్డు కౌన్సిలర్ సతీష్‌రెడ్డి



సతీష్‌రెడ్డి

మడకశిర: ''నేను వైఎస్ జగన్ వీరాభిమానిని. ఆయన అవకాశం కల్పించబట్టే కౌన్సిలర్‌ను అయ్యాను. నా ప్రాణం ఉన్నంత వరకూ రాజకీయాల్లో జగన్ వెంటనే నడుస్తాను. అమ్మపాలు తాగి రొమ్ముగుద్దను. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీకి ద్రోహం చేయను'' అని 16వ వార్డు కౌన్సిలర్ సతీష్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ గుర్తుపై కౌన్సిలర్‌గా విజయం సాధించిన తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మడకశిర మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై టీడీపీ ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానానికి తాను మద్దతిచ్చే ప్రసక్తే లేదన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టాటని కోరుతూ కొందరు కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసులో తాను సంతకం చేయలేదని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



మృతుడు హనుమంతరాయప్ప

గుడిబండ: దప్పిక తీర్చుకోవడం కోసం బావిలోకి దిగిన ఓ వృద్ధుడు కాలు జారి అందులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..కరికెర గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప(72) శనివారం గ్రామ సమీపాన తన పొలం వద్దకు వెళ్లాడు. దప్పిక వేయడంతో నీరు తాగేందుకు బావిలోకి దిగాడు. ఈక్రమంలో కాలుజారి అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటి మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న మడకశిర అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని నీటిలో మునిగిన హనుమంతరాయప్ప మృతదేహాన్ని బయటికి తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజీకుల్లాయప్ప తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సతీష్

కదిరి టౌన్: బీమా రంగంలో విదేశీ పెట్టుబడులకు వ్యతిరేకంగా మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి.సతీష్ పిలుపునిచ్చారు. ఎల్ఐసీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం కడప డివిజన్ ఉపాధ్యక్షుడు సూరిబాబు అధ్యక్షతన శనివారం కదిరి ఎల్ఐసీ కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఆర్‌డీఏ సంస్థ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుకూలంగా పనిచేస్తూ ఎల్ఐసీని బలహీన పరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉద్యోగుల అందరికీ పెన్షన్, పెన్షన్ ఆప్షన్, స్టాగ్నేషన్, ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథ్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, నాయకులు అక్బర్ బాషా, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మడకశిర: సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలలోనే అన్ని ప్రభుత్వ శాఖలను గాడిలో పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,500 డీఎస్సీ పోస్టుల ప్రక్రియకు శ్రీకారం చుట్టామని, పోలీస్‌శాఖలో వివిధ పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు మే 2న ప్రధాని నరేంద్రమోదీచే శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత మంత్రి మడకశిరలో రూ.2 కోట్లతో నిర్మించిన బాల్‌బ్యాడ్మింటన్ హాలు, టేబుల్ టెన్నిస్ కోర్టు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం కదిరి–అనంతపురం, కదిరి–రాయచోటి సర్వీసులను ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, బాబూ జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహాల స్థాపనకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా డిపోలో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ లాభాలు వచ్చే 150 డిపోల్లో ప్రతి డిపోకు కొత్తగా 20 బస్సులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కొత్తగా గ్రామీణ ప్రజల సౌకర్యార్థం 1000 అదనపు బస్సులు నడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా డిపోలను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, డీపీటీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులుగా ఇక్కడే..



లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం పొలాలు, కర్ణాటక సరిహద్దులోని బీటీరోడ్డు పక్కన నాలుగు రోజులుగా ఓ ద్విచక్రవాహనం (ఏ03హెచ్‌ఎక్స్ 3097) ఉంది. ఈ ప్రాంతంలో వాహనం తప్ప ఇతర ఆనవాళ్లు లేవు. వాహనం గురించి స్థానికులు లేపాక్షి పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని సమాచారం. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'అనంత'లో దొంగల స్వైర విహారం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం: నగరంలో దోపిడీ దొంగలు స్వైర విహారం చేశారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకూ ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. నాలుగో రోడ్డు ఎక్స్‌టెన్షన్ శాంతినగర్ గౌరవ గార్డెన్స్‌లో ఉండే ఐదు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేశారు. గౌరవ్ గార్డెన్ రెండో క్రాస్‌లో ఆర్. మణికంఠ, డి.మహేశ్వరరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాజమౌళి, నీలిమ ఇంటి యజమానులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి తలుపులకు వేసిన తాళాలతో పాటు ఇన్నర్‌లాకులను సైతం దొంగలు తొలగించారు. ముందుగా తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు తెగబడ్డారు. రిటైర్డ్ ఆఫీసర్ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు దొంగలు చోరీల్లో పాల్గొన్నట్లు తెలిసింది. పోలీసులకు సమాచారం అందడంతో ఉదయమే ఘటనాస్థలాలకు వెళ్లి పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు.

ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు..

గౌరవ్ గార్డెన్స్‌లో ఏకంగా ఐదు ఇళ్లల్లో చోరీ జరగడం నగర ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇద్దరు దొంగలు ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించారు. కనీసం ఫింగర్ ప్రింట్లు కూడా దొరకకుండా అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. అర్ధరాత్రి 1 గంట నుంచి ఉదయం 5:15 నిమిషాల వరకు ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. అయితే ఐదు ఇళ్లల్లో విలువైన వస్తువులు చోరీకి గురికాలేదు. బంగారు లాకర్లలో పెట్టుకోవడంతో విలువైన వస్తువులు పోలేదు. ఒక ఇంట్లో 8 తులాల బంగారు, వెండి ఉన్నప్పటికీ, బీరువాలో పెట్టకుండా.. పోపు డబ్బాలో దాచుకున్నారు. దీంతో వీరి సొమ్ము భద్రంగా ఉంది. సీసీ కెమెరాల ఫుటేజీని సైతం పరిశీలించి పోలీసులు నిర్ధారణ చేశారు. ఇదిలా ఉండగా, చోరీ జరిగిన ఇళ్లను అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్ పర్యవేక్షించారు.

ప్రశాంతి నిలయంలో భద్రత కట్టుదిట్టం



సాయికుల్వంత్ సభా మందిరం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

ప్రశాంతి నిలయం: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ప్రశాంతి నిలయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. శనివారం ఆమె సిబ్బందితో కలసి ప్రశాంతి నిలయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ గేట్, వెస్ట్ గేట్, షాపింగ్ మాల్ ప్రాంతం, సాయికుల్వంత్ సభా మందిరం, భక్తులు బస చేసే బిల్డింగ్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కాశ్మీర్‌లో ఉగ్రదాడి తర్వాత జిల్లా వ్యాప్తంగా భద్రతా పరమైన అంశాలపై తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సైతం అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలన్నారు. వివిధ దేశాల నుంచి ప్రశాంతి నిలయానికి భక్తులు వస్తుంటారని, ఇక్కడ భక్తులకు మెరుగైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీలు విజయ్ కుమార్, శ్రీనివాసులు, సీఐలు సునీత, ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.